ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి

పిజిఆర్‌ఎస్ ఫిర్యాదులు పరిష్కారంలో ఆలస్యం చేయరాదని ఎస్‌పి ధీరజ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకార్యక్రమాన్ని ఎస్‌పి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను నేరుగా విని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల అర్జీలను ఆయన స్వీకరించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమపేరుతో మోసాలు, ఇతర సమస్యలపై ఎస్‌పి స్వయంగా విచారణ జరిపారు. ఎస్‌పి ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, చట్టపరిధిలో తక్షణ మే న్యాయం అందించాలి అని ఆలస్యం చేయకూడదని ఆదేశించారు. చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే, వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌పి

అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లె

- కడపలోకి రాజంపేట, తిరుపతిలోకి రైల్వేకోడూరు, మదనపల్లిలోకి రాయచోటి
- మంత్రి 'మండిపల్లి' తుదికంటా విఫలయత్నం
- రాయచోటికి మెడికల్ కళాశాల హామీ?!
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెకు మారింది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలోని అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు జిల్లాల శాస్త్రీయ విభజన పేరుతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి పలు మార్లు అధ్యయనం చేసింది. అధ్యయన బృందం తయారు చేసిన నివేదికను ప్రభు త్వానికి అందజేసింది. శని, ఆదివారాల్లో కేబినెట్ సబ్ కమిటీ ముఖ్య మంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమై చర్చించింది. సోమవారం ముఖ్య మంత్రి అధ్యక్షతన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తుదినిర్ణయం తీసుకుంది. 22 ఎజెండా అంశాలపై చర్చించింది. అన్నమయ్య జిల్లాను మూడు ముక్కలుగా చీల్చుతూ జిల్లా అస్తిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చుతూ తుది నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజకీయ కలకలం రేగింది. రాయచోటి జిల్లా కేంద్ర పరి రక్షణ పోరులో రాయచోటి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తుదివరకు పోరాడినప్పటికీ ఎటువంటి ఫలిత మూ లేకుండా పోయింది. ఆయన చేసేదేమీ లేక పోవడంతో భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతం కావడం అందరి దృష్టినీ ఆకర్షించింది. చివరికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని మంత్రి మండిపల్లిని సముదాయించి నట్లు సమాచారం. రాయచోటి అభివృద్ధికి తానుబాధ్యత వహిస్తానని, మీకు అండగా ఉంటానని ఊరడించినట్లు తెలుస్తోంది. రాయచోటికి ప్రభుత్వ మెడికల్ కళాశాలను కేటాయిస్తాననే హామీతో ఊరడించినట్లు కనిపిస్తోంది. ఆదివారం నాటి కేబినెట్ సబ్ కమిటీ సమాలోచనల ప్రకారమే అన్నమయ్య జిల్లాను మూడు ముక్కలుగా విభ జిస్తూ తుదినిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. పూర్వ అన్న మయ్య జిల్లాకు చెందిన రాజంపేట అసెంబ్లీని కడప జిల్లాలోనికి, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలోనికి, ఇటీవలే ఏర్పాటైన మదనపల్లి జిల్లా కేంద్రం లోనికి రాయచోటి అసెంబ్లీని తరలింపు నిర్ణయాలను కేబినెట్ ఆమోదించింది. ఈనెల 31న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిని తొలగించి మదన పల్లికి మారుస్తూ తీసుకున్న నిర్ణయానికి నిరసనగా మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ పోలంరెడ్డి విజయమ్మ తమ పదవులకు రాజీనామా చేశారు. తమ రాజీనామాలను వారు రాయచోటి మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ రవిరెడ్డికి అధికారికంగా సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాయచోటి అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిందన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నేతలు విజయ భాస్కర్, ఖాదరవల్లి పాల్గొన్నారు.

కమిషనర్‌కు రాజీమానా పత్రాన్ని అందిస్తున్న దశరధరామిరెడ్డి విజయమ్మ

జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలి

-కలెక్టరేట్ ఎదుట న్యాయవాదుల ధర్నా

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని అలాగే కొనసాగించాలని రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. సోమవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి కోర్టు గేటు ఎదుట నిరసన తెలిపిన అనంతరం కలెక్టరేట్ వద్దకు చేరుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పి.రెడ్డిబాష మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి కావలసిన అర్హతలు అన్నీ కూడా రాయచోటికి ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డి న్యాయవాదులు సుంకు రవీంద్ర పి.రెడ్డయ్య, టి.ఈశ్వర్, ఖాదర్‌బాషా, రెడ్డప్పరెడ్డి, రామాంజ నేయులు, వీరభద్ర,నాగమల్లు, లక్ష్మీదేవి, శివమ్మ, కృష్ణమ పాల్గొన్నారు.

జెఎసి ఆధ్వర్యంలో ర్యాలీ

అన్నమయ్య విభజనతో పాటు జిల్లా కేంద్రం రాయచోటిని మారుస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రం రాయచోటిలో జెఎసి ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా రాజకీయ మేధావులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల వారు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని చెక్ పోస్ట్ శివాలయం నుంచి నేతాజీ సర్కిల్, జామియా మసీదు సర్కిల్, గాంధీ బజార్, వైయస్సార్ సర్కిల్ మీదుగా నేతాజీ కూడలి వరకు ర్యాలీ కొనసాగించారు. అన్నమయ్య జిల్లాను విభజించవద్దు, రాయచోటి జిల్లా కేంద్రంగానే కొనసాగించాలి, మదనపల్లి వద్దు-రాయచోటి ముద్దు, ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు రాయచోటి వాసులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ర్యాలీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మంత్రి వర్గ సమావేశంలో తీసుకున్న జిల్లా కేంద్రం మార్పు అంశాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

రాయచోటి : ర్యాలీ నిర్వహిస్తున్న జెఎసి నాయకులు

ప్రజాభిప్రాయాన్ని గుర్తించాలని రాస్తారోకో

రామాపురం : రాయచోటి ప్రజాఅభిప్రాయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని రాయచోటి జిల్లా కేంద్రంగా కొనసాగించాలని లేనిపక్షంలో కడప జిల్లాలో కలపాలని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారనాథరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి 40వ జాతీయ రహదారిపై సోమవారం నాగ బసిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అంజనారెడ్డి, మాజీ జడ్‌పిటిసి నాగసుబ్బారెడ్డి, రామచంద్రయ్య యాదవ్ శివారెడ్డి, చిట్టిరెడ్డి, అజామ్ ప్రతాప్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, అయూబ్‌ఖాన్, హరినాథ్, రేగం బ్రదర్స్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వినతులకు సత్వర పరిష్కారం : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-రాయచోటి

పిజిఆర్‌ఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో డిఆర్‌ఒ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్‌ఎల్‌ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా డిఆర్‌ఓ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్య క్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న డిఆర్‌ఒ మధుసూదన్‌రావు

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- రూ.61 లక్షల విలువైన దుంగలు స్వాధీనం : ఎస్‌పి

స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలతో ఎస్‌పి ధీరజ్

ప్రజాశకి-రాయచోటి

జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్ల ఆటకట్టించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోందని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. సోమవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సోమవారం తెల్లవారు జామున వీరబల్లి మండలంలో నిర్వహించిన మెరుపు దాడిలో ఎర్ర చందనం దుంగలను తమ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వీరబల్లి పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తమిళనాడు స్మగ్లర్లతో చేతులు కలిపి కొందరు స్థాని కులు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో, రాయచోటి డిఎస్‌పి ఎం.ఆర్.క్రిష్ణమోహన్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయన్నారు. కురవపల్లి-ఉప్పరపల్లి రోడ్డులోని దేవదాశి చెరువు వద్ద అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అన్నమయ్య జిల్లా గడికోట గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల చంద్ర మోహన్, తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన రమేష్‌వట్టన్‌ను అదుపులోకి తీసు కున్నట్లు తెలిపారు. వారి నుంచి ఎ1 క్వాలిటీ గల రూ.61లక్షలు విలువ చేసే 18 ఎర్రచందనం దుంగలు, ఒక కారు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఈ కేసులో వీరబల్లి మండలానికి చెందిన ఇద్దరు, రాయచోటి మండలానికి చెందిన ఒకరు, పరారీలో ఉన్నారని, పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమర్థవంతంగా పనిచేసి ఈ కేసును ఛేదించిన రాయచోటి రూరల్ సిఐ ఎస్.కె.రోషన్, రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ సిఐ టి.వి. కొండారెడ్డి, వీరబల్లి ఎస్ఐ సుస్మిత, టి.సుండుపల్లి ఎస్ఐ హుస్సేన్ వారి సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

కల్తీ మద్యం కేసులో ముగిసిన నిందితుల కస్టడీ

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్ : రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితులు జనార్ధన్ రావుతో పాటు జగన్మోహన్, రమేష్, అష్రఫ్, ఆలీ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు అనుమతి కోరుతూ కస్టడీ తీసుకోగా సోమవారం ఉదయం 10 గంటలకు కస్టడీ సమయం ముగిసింది. ఆ వెంటనే వారిని కోర్టులో హాజరు పర చాల్సి ఉంది. ఈ కేసులో 33 మంది నిందితులు ఉండగా, ఇప్పటికే 25 మందికి కస్టడి విచారణ పూర్తి చేశారు. ప్రస్తుతం కస్టడీకి తీసుకున్న ఐదుగురు నిందితుల వద్ద స్టేట్‌మెంట్లు రికార్డు చేసిన అనంతరం తిరిగి వారిని సకాలంలో కోర్టులో హాజరు పరచి, సబ్ జైలుకు తరలించాల్సి ఉంది. ఎ1 నిందితుడు జనార్ధన రావుతో సహా మరో నలుగురు నిందితులు స్టేట్ మెంట్‌పై సంత కాలు పెట్ట కుండా నిరాకరించినట్లు తెలిసింది. సోమవారం ఉదయం 10 గంటలకే కస్టడీ సమయం ముగిసి నప్పటికీ మధ్యాహ్నం 12:30గంటల వరకూ నిందితులు ఎక్సైజ్ స్టేషన్‌లోనే ఉండుపోవాల్సి రావడంతో పోలీసులు మల్ల గుల్లాలు పడ్డారు. పోలీసులు తమ ఇష్టా రీతిలో విచారించి, వారికి ఇష్టం వచ్చినట్లు నివేదిక సిద్ధం చేసు కోవడం, తాము చెప్పినట్లు కాకుండా సంభంధం లేనివన్నీ చేర్చి సంతకం పెట్టమంటే ఎలా పెడతామని నిందితులు పోలీసులకు ఝులక్ ఇచ్చినట్లు తెలిసింది. అప్పటికే కస్టడి సమయం ముగిసిపోవడం, జనార్ధనరావు తో పాటు మిగతా నిందితులు సంతకాలు పెట్టమని తిరగబడటంతో ఎక్సైజ్ పోలీసులకు ఏం చేయాలో దిక్కు తోచక తలలు పట్టుకున్నారు. తరువాత ఏమి చేసుకున్నారో ఏమో మధ్యాహ్నం ఒంటిగంట తరువాత నిందితులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు అనంతరం కోర్టుకు తరలించారు.

జనార్ధన్ రావును కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

బిసి కులగణన చేపట్టాలి : బిజెఎస్

మాట్లాడుతున్న శ్రీచందు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిసి కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బిసి ప్రతిఘటన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీచందు స్థానిక సంస్థల్లో బిసి వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసు కోవాలన్నారు. బిసి కులాల ధామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. కాక కాలేల్కర్, బి.పి మండల్, మురళీధర్ రావు కమిషన్ సిఫార్సులు 52శాతం పైగా బిసిలకు వాటా రావాలని నివేదికలో ఉన్నా ఇంతవరకు అమలు జరగకపోవడం రాజకీయ కుట్రలో భాగమేనని విచారం వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాల తెగింపు చూసి ఏపిలో కూడా కూటమి ప్రభుత్వం బిసి సమాజం పట్ల చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న బిసి బిల్లులను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. ఈ కీలకమైన సమస్యలను పరిష్కరించకుండా ఎన్నికలకు వెళ్లడం వల్ల 56 శాతం బిసిలకు సామాజిక న్యాయం కొరవడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, సిపిఐ నాయకులు సాంబ, ముబారక్, వాల్మీకి సంఘం పులి శ్రీనివాసులు, వడ్డెర సంఘం కృష్ణయ్య, బిసి ఆటో యూనియన్ నాయకులు, రాఘవేంద్ర యాదవ్, విద్యార్థి సంఘం నాయకుడు ఉత్తన్న, రజక సంఘం నాయకులు ఎస్‌కె.రెడ్డప్ప, మైనార్టీ నాయకులు ఇస్మాయిల్, పౌరహక్కుల సంఘం నాయకుడు నాగేశ్వరరావు, బహుజనసేన నాయకులు జయశంకర్, భాను ప్రకాష్, మావిళ్ళ వెంకటేష్, సొట్ట రెడ్డి శేఖర్, కుప్పం శివకుమార్, గాంధీపురం లారా, మహిళా నాయకులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అభివృద్ధికి సిఎం చంద్రబాబు హామీ

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన అంశాలలో భాగంగా సిఎం భరోసా నిచ్చారున్నారు. ఈ నేపథ్యంలో సిఎంఒ నుంచి ఫోన్ కాల్ రావడంతో ముఖ్యమంత్రిని కలిసినట్లు తెలిపారు. ఈ భేటీలో రెవెన్యూ శాఖ మంత్రిసత్యప్రసాద్, సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు కూడా ఉన్నారున్నారు. రాయచోటి అగ్రగామిగా నిలిచేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని సిఎం హామీనిచ్చారని తెలిపారు. రాయచోటిపై తనకున్న అనుబంధం, మమకారం గురిం గుర్తు చేశారున్నారు. గతంలో రూపొందించిన ప్రణాళికల ప్రకారమే రాయచోటిని ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని చెప్పారని పేర్కొన్నారు. అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, పరిపాలనా సదుపాయాలతో రాయచోటి మరింత ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. రాయచోటిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రాయచోటి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మరింత కృషి చేస్తానని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు తెలిపారు. సోమవారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో మండల స్థాయి కార్యకర్తల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు నిరంతరం ప్రజలతో మమేకమవుతూ ఉండాలన్నారు. సూపర్‌సిక్స్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని, గ్రామ స్థాయిలో ప్రతి కార్యకర్త పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలన్నారు. ఏ స్థాయిలో ఉన్న నాయకులైన స్థానికంగా ఉన్న గ్రామ మండల కమిటీలతో కలసి పనిచేయాలన్నారు. గ్రామ నాయకులు మండల నాయకులు వారితో చర్చించి వారిని కలిపే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం మాధవరం, నడింపల్లె, కొండమాచుపల్లె గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి విడి విడిగా చర్చించి నాయకులకు, కార్యకర్తలకు చమర్తి పలు విషయాలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జడ్‌పిటిసి, ఎంపిటిసి, గ్రామ అధ్యక్షులు కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు గంగమ్మ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మండల పరిధిలోని కొత్తపేట సమీపంలోని శ్రీ గంగమ్మ దేవత దేవస్థానంలో శాశ్వత హుండీలను మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఒక ప్రనటణలో ఎం.కృష్ణనాయక్ పేర్కొన్నారు. దేవాదాయశాఖ అధికారులు, ఆలయ పాలక మండలి సమక్షంలో హుండిలను లెక్కిస్తామన్నారు.

చేయాల్సిందంతా చేసి కన్నీరు కార్చడమెందుకో? : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

రాష్ట్ర మంత్రిగా ఉండి, జిల్లాల పునర్విభజనం అంశంపై జరిగిన మంత్రి వర్గ సమావేశంలో పాల్గొని అడ్డుచెప్పకపోగా, సమావేశం అనంతరం బయటకు వచ్చి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కన్నీరు కార్చడంపై వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో రాయచోటిలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు రాయచోటిని జిల్లా కేంద్రంగానే కొనసాగిస్తామని ప్రజలకు హామీయిచ్చారన్నారు. నేడెమో పలురకాల సాకులు చెబుతూ జిల్లా కేంద్రంను రద్దుచేయడం చంద్రబాబుకు ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మాయమాటలు చెప్పి తాను అధికారాన్ని దక్కించుకున్నాక వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు సహజ స్వభావమన్నారు. ఇంతవరకు దేశంలో ఏర్పాటైన జిల్లాలను రద్దుచేసిన చరిత్ర లేదన్నారు. చంద్రబాబు ఒక్కరే కొత్తగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాను ముక్కలు చేసి రద్దుచేశారంటూ విమర్శించారు. పార్లమెంటు కేంద్రాలను జిల్లాల ఏర్పాటు ప్రాతిపదికంగా నిపుణుల కమిటీ నివేదికతో వైసిపి ప్రభుత్వం హయాంలో జిల్లాను ఏర్పాటు చేశారని తెలిపారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసమే జిల్లాను రద్దుచేశారు తప్ప మరొకటికాదన్నారు. మదనపల్లె జిల్లా ఏర్పాటును తాము వ్యతిరేకించ లేదన్నారు. ఏకారణాలతో అన్నమయ్య జిల్లాను రద్దు చేశారో చెప్పవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. జిల్లాకు రద్దుకు జరుగుతున్న రద్దుకుట్రల గురించి గతకొద్దిరోజులుగా చెబుతూనే ఉన్నానన్నారు. మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తి జిల్లా ఉంటుందని, ఎక్కడికి పోదంటూ తొడలుకొడతాం, మీసాలు తిప్పారు. మంత్రివర్గ సమావేశంలో ఉండికూడా ఇప్పుడేమో జిల్లా రద్దును అడ్డుకొడుతూ మొసలికన్నీరు కారుస్తున్నారన్నారు. ప్రభుత్వం జిల్లా రద్దుపై తన మొండివైఖరిని వీడకపోతే గట్టి పోరాటం చేస్తామన్నారు.

మహిళల డబ్బులు మట్టిపాలేనా..?

- సిబ్బంది చేతివాటంతో మూతదశకు మహిళా మార్టు
- ఆందోళనలో మహిళా సంఘాల సభ్యులు

మూసివేతకు సిద్ధంగా ఉన్న చేయూత మహిళా మార్టు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు గత వైసిపి ప్రభుత్వం మహిళల కోసం మహిళా సంఘాల డబ్బుతో చేయూత మహిళా మార్టును ఏర్పాటు చేసి.. సరసమైన ధరలకు.. నాణ్యమైన వస్తువులు అందించడం జరుగుతుందని రాష్ట్ర వ్యాప్తంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రస్తుత టిడిపి హయాంలో మార్టులో అవినీతి పేర్కుపోవడంతో మార్టును మూసి వేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు పుకార్లు షికార్లు కొడుతున్నాయి.

మూడేళ్ల క్రితం మండలంలోని 900 మహిళా సంఘాల సభ్యుల నుంచి దాదాపు రూ.27లక్షలు డబ్బులు వసూలు చేసి అట్టహాసంగా చేయూత మహిళా మార్టును 28 నవంబరు 2022న ప్రారంభించారు. అప్పటి నుంచి వ్యాపార లావాదేవీలు బాగా సాగినప్పటికీ లెక్కలు జమలు చూడాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ.. తూతూమంత్రంగా రావడం నామమాత్రంగా రికార్డులను చూసి అందినకాడికి దోచుకొని వెళ్లినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. మార్టులో లక్షల్లో వ్యాపారాలు జరిగాయని నష్టాలు బాట పట్టడం ఏమిటని పలువురు డ్వాక్రా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెలుగు కార్యాలయ అధికారులు, సిబ్బంది చేతివాటం వలనే నష్టాల బాట పట్టిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు తేల్చాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

900 డ్వాక్రా సంఘాల నుంచి డబ్బులు వసూలు

మండలంలోని దాదాపు 900 డ్వాక్రా సంఘాల నుంచి రూ.27 లక్షలు నగదు వసూలు చేసి చేయూత మార్టును అప్పటి అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం మార్టును మూసివేయనున్నట్లు వస్తున్న ఆరోపణలపై అధికారులు స్పందించాల్సి వుంది.

నష్టాల పేరుతో కుచ్చుటోపి

900 డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి రూ.27 లక్షలు వసూలు తిరిగి చెల్లించాల్సి వస్తోందన్న నెపంతోనే నష్టాల బాట పేరుతో వెలుగు అధికా రులు, ఉన్నతాధికారులు కుమ్మక్కై డ్వాక్రా సంఘాల సభ్యులకు కుచ్చుటోపి పెట్టేందుకు నాటకాలు ఆడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

మా డబ్బులు మాకు చెల్లించండి

డ్వాక్రా సంఘాల సభ్యులు నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి సంఘాలకు చెల్లించాలని పలువురు గ్రూపు సభ్యులు కోరుతున్నారు. కష్టపడి కూలి పనులు చేసి సంపాధించుకొని మార్టు పెట్టుకోవాలంటే ఇచ్చామని, నష్టాలపేరుతో చేతులు ఎత్తేయడం సమంజసం కాదన్నారు.

విచారణ చేపట్టి.. ఆడిట్ నిర్వహించి.. అక్రమాల భరతం పట్టాలి

మార్టులో జరిగినా అక్రమాలపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, ఆడిట్ నిర్వహించి, మార్టులో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చాలని గ్రూపు సభ్యులు కోరుతున్నారు. మహిళల డబ్బులు దుర్వినియోగం కాకుండా వెంటనే అధికారులు విచారణ చేపట్టాలని పలు గ్రూపు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీగా దర్శనమిస్తున్న మార్టు

మాట్లాడుతున్న పిటిఎం శివప్రసాద్

మదనపల్లె జిల్లా పేరునే కొనసాగించాలి : జెఎసి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశానికి జాతీయ గీతాన్ని అందించి, జాతి ఐక్యతకు జీవనాడిగా ఉన్న మదనపల్లె, దేశానికి ఆత్మ వంటిదని, అంత గొప్ప మదనపల్లెకు ముందో, వెనకో తోక తగిలించాల్సిన అవసరం లేదని, జిల్లాకు మదనపల్లె పేరే పెట్టాలని, మదనపల్లె జిల్లా సాధన సమితి కన్వీనర్ పిటిఎం శివప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య పేరుతోనే జిల్లా, జిల్లా కేంద్రంగా మదనపల్లె అంటూ మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు హర్షించడం లేదన్నారు. మదనపల్లె పవిత్ర భూమి అని, మదనపల్లె జిల్లా ఏర్పాటు చేసే బాధ్యత మాది అని హామీ ఇచ్చిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. మద నపల్లె జిల్లా అనేది ఇక్కడి ప్రజల 114 ఏళ్ల ఆకాంక్ష అని, తమ ఆకాంక్ష నెరవేరబోతోందని ఆశతో ఎదురు చూస్తున్న సమయంలో, మదనపల్లె జిల్లా ఉండదన్న ప్రకటన తీవ్ర ఆవేదనకు గురించేస్తోందన్నారు. ఇది టిడిపికి పార్టీకి తీరని నష్టం కలిగిస్తుందన్నారు. అన్నమయ్య పై మాకు గౌరవం ఉందని, తిరుపతికో, కడపకో అన్నమయ్య పేరు పెడితే సమంజసంగా ఉంటు ందని, అలా చేస్తే మేము కూడా సంతోషిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా సాధన సమితి సభ్యులు ముత్యాల మోహన్, చాట్ల బయన్న, రెడ్డిప్రసాద్, శశిధర్ పాల్గొన్నారు.

రైతులకు పశుదాణాను అందిస్తున్న రమేష్‌నాయుడు

పాడి రైతులకు పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని ముడుంపాడు గ్రామపంచాయతీ సోమవారం పశు వైద్యులు డాక్టర్ రవికుమార్, టిడిపి మండల అధ్యక్షులు రమేష్‌నాయుడు చేతుల మీదుగా దాణ పంపిణీ కార్యక్రమనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్‌నాయుడు, మండల అధ్యక్షులు రమేష్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరై, 50 శాతం సబ్సిడీతో 450 బస్తాల దాణను పాడి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతుల ఆర్థిక భద్రతకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పశపోషణ రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, రైతులకు అవసరమైన సబ్సిడీలు, సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని తమ ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రెడ్డిరాణి, రైతులు పాల్గొన్నారు.

వృద్ధురాలి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి తన దృష్టికి వచ్చిన ఓ సమస్యను అక్కడికక్కడే పరిష్కరించారు. పట్టణంలోని నక్కల దిన్నె తండాకు చెందిన వృద్ధురాలు ఎం.రాజమ్మ సోమవారం అర్జీ పట్టుకుని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమానికి వెళ్లింది. తనకు చాలాకాలంగా చెవులు సరిగ్గా వినిపించడం లేదని, సమస్య పరిష్కరించాలని అర్జీలో వివరించింది. వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి ఇయర్ మిషన్ తెప్పించి, అర్జీదారురాలు రాజమ్మకు అందించారు. అర్జిదారురాలు రాజమ్మ ఎంతో సంతోషపడి సబ్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మోడీ పాలన అన్ని విధాలా విఫలం

ప్రజాశక్తి - వేంపల్లె

నరేంద్ర మోడీ పాలనలో 2025లో అన్ని విధాలా విఫలమైందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పాతాళానికి పడిపోయిందన్నారు. భారతీయ విద్యార్థులకు విదేశీ విద్య భారమైందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలో ఉంటున్న భారత అక్రమ వలసదారులను అమెరికా ప్రభుత్వం మానవత్వం లేకుండా అక్కడి నుంచి భారతదేశానికి పశువుల్లా పంపిస్తే మోడీ ప్రభుత్వం కనీసం నిరసన కూడా తెలియజేయలేదని విమర్శించారు. విమాన ప్రయాణికులు నరకం చూశారని, ఇది మోడీ ప్రభుత్వం వైఫల్యానికి పరాకాష్ట అన్నారు. దేశ రాజధాని ఢిల్లీ కాలుష్యంతో నివాసయోగ్యంకాని స్థితికి చేరుకోవడం సిగ్గుచేటన్నారు. 2025లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందన్నారు. భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ రాజీనామా చేస్తే ఆయనకు కనీసం వీడ్కోలు కూడా పలకలేదన్నారు. జాతిని అవమాన పరిచేలా మహాత్మా గాంధీ పేరును ఉపాధి హామీ చట్టం నుంచి తొలగించారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, నాగరాజుపాల్గొన్నారు.

పెయ్య దూడల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

పెయ్యదూడల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాజ తిమ్మారెడ్డి సూచించారు. మైదుకూరు మండలం మాచుగారిపల్లి గ్రామంలో సోమవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో ఆ శాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు వాటాగా రూ.150చెల్లించి పెయ్యదూడల సూదుల పథకం ప్రవేశపెట్టిందన్నారు. పశువు ఎదకు వచ్చినప్పుడు ఈ సూది వేయడం వల్ల పెయ్యదూడలు మాత్రమే పుడుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో 9 చూడి పశువులకు పరీక్షలు, 19 పశువులకు గర్భకోవ వ్యాధి చికిత్సలు, 48 దూడలకు నట్టల నివారణ మందులు, 79 పశువులకు సాధారణ చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనిపెంట పశువైద్య అధికారి సి.గురివిరెడ్డి, డాక్టర్ విజయనిర్మల, సిబ్బంది ఎం యశోద, పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

లైంగిక దాడుల నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

బాలలపై లైంగిక దాడుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిహెచ్‌సి వైద్యాధికారులు శ్రీకాంత్, కరిష్మా సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారులు ఆధ్వర్యంలో బాలలపై లైంగిక దాడుల నివారణపై ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలకు మండలస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జమ్మలమడుగు ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం బాలల సత్వర చికిత్స కేంద్రం చైల్డ్ సైకాలజిస్ట్ ఉదయ చంద్రిక, రాష్ట్రీయ కిషోర స్వస్థియా యుక్త వయసు కౌన్సిలర్ డి.బాల గురప్ప పిల్లలపై జరిగే లైంగిక దాడుల రకాలు, మానసిక గాయాలు, ప్రవర్తన వాటి ప్రభావాలపై శిక్షణనిచ్చారు. పిల్లలపై అకృత్యాలు జరగకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిల్లల రాతలు, మాటలు, హావ భావాలు, హద్దులుపై అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లల రక్షణ కోసం అమలు చేస్తున్న ఫోక్సో చట్టం చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ప్రసాద్ యాదవ్, సూపర్‌వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ జయకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

- డిసిహెచ్ఎస్ డాక్టర్ లక్ష్మీప్రసాద్

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ కోరారు. సోమవారం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కొత్త భవనం మాత శిశు రక్షణ కోసం అని, ఒపిడి బ్లాక్, వార్డులును పాత ఆసుపత్రి భవనం లోకి వీలైనంత త్వరగా మార్చాలని ఆదేశించారు. ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రిల మీద నమ్మకం కలిగేలా సేవలు అందించాలని చెప్పారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. ఆసుపత్రి సిబ్బంది ఎవరైనా లంచం అడిగితే వెంటనే వైద్యాధికారి దృష్టికి తీసుకు రావాలని లేదా సూచించారు. మందులన్నీ అందుబాటులో ఉంచాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సానిటేషన్ సిబ్బందికి సూచించారు.ఒపి, ఐపి, డెలివరీలు, ఇహెచ్ఆర్, ఎన్‌టిఆర్ వైద్యసేవ, అభ, ఎఫ్ఆర్ఎస్, ల్యాబ్, ఫార్మసీ, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్ మరియు డైట్ రికార్డులను తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, ఎన్‌టిఆర్ వైద్యసేవను మెరుగుపం చాలన్నారు. కొత్త భవనంలో మాత శిశు వైద్య సేవలు, ఎక్స్‌రే, ల్యాబ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పాత భవనం రెనోవేషన్‌లో ఉండటం వల్ల తాత్కాలికంగా ఓపి, ఐపి సేవలు కొత్త భవనం లో కొనసాగిస్తున్నామని, 2 లేదా 3 రోజుల్లో పాత భవనం లోకి వార్డు లను మార్చమని వైద్యాధికారిని ఆదేశించారు. పాముకాటుకు, కుక్కకాటుకి సంబంధించన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గుండెపోటుకు సంబంధించిన రూ.40వేలు విలువ చేసే టెనెక్టప్లేస్ ఇంజెక్షన్ అందుబాటులో ఉందని గుండె నెప్పి వచ్చినప్పుడు ఇసిజి తీసుకొని అవసరమైతే వైద్యులు ఆ ఇంజెక్షన్ ఇస్తారని, ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వై పవన్ కుమార్, డాక్టర్ శశికుమార్ రాజు,డాక్టర్ ఆశాలత, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ అన్వేష్, ఇంచార్జ్ హెడ్ సిస్టర్ వనజమ్మ, ఫార్మసిస్ట్ నవీన, రేడియోగ్రాఫర్ వెంకటరమణ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారులకు సూచనలు ఇస్తున్న డిసిహెచ్ఎస్ లక్ష్మీప్రసాద్

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి : ఎంపిపి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి విజయభాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

మండల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని మండల అధ్యక్షులు మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ కెఆర్ఎం ప్రసాద్ అధ్యక్ష తన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. అనం తరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహ శీల్దార్ అమరేశ్వరి, ఎంపిడిఒ కెఆర్ఎం ప్రసాద్, వైస్ ఎంపిపిలు అనుదీప్, తుమ్మల భావన, మండల కో-ఆప్షన్ సభ్యులు కలీం, ఎంపిటిసిలు కొండూరు రమేష్‌బాబు, మోదుగుల సుబ్బమ్మ, పునగాని వెంకటసుబ్బమ్మ, సోమిశెట్టి సునీత, సర్పంచ్‌లు అక్కిరెడ్డి మోహ న్‌రెడ్డి, గీతాల నరసింహారెడ్డి, మోడపోతుల రాము, యానాది, విజయకుమార్, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : 'ఆకేపాటి'

ప్రజాశక్తి - నందలూరు

క్రీడలు విద్యార్థుల జీవితాల్లో ఆత్మవిశ్వాసాన్ని, మనోధైర్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కౌట్ గ్రూప్ సంస్థ 27వ వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. సంద ర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల పట్ల మక్కువతో, క్రమ శిక్షణతో, ఏకాగ్రతతో లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడి పనిచేస్తే, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సూచించారు. కార్యక్రమంలో అనుదీప్ జయసింహ, మండల కో ఆప్షన్ సభ్యులు కలీం, తుమ్మల భావన, కొండూరు రమేష్ బాబు, గీతాల నరసింహారెడ్డి, గుణ యాదవ్, గొబ్బిళ్ళ త్రినాథ్ యాదవ్, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, నడివీధి సుధాకర్, మధురాజు, గుండు మల్లికార్జున రెడ్డి, పాటూరు చంద్ర, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

త్రోబాల్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ఆర్ఒ ప్లాంట్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, రూపానందరెడ్డి

ప్రజాశక్తి -చిట్వేలి

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కె.కందుల వారిపల్లి గ్రామ పంచాయతీ గాంధీనగర్‌లో ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందిం చేందుకు ఆర్ఒ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతులతో పాటు పరిశుభ్రమైన తాగునీటిని అందించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పరిశుభ్రమైన నీటిని అందించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు ఓబినేని రంగయ్య యాదవ్, రాజుకుంట సర్పంచ్ నరసింహ, రాజశేఖర్ నాయుడు, నక్కలపల్లి సర్పంచ్ చంద్రమోహన్‌నాయుడు, నాగయ్యయాదవ్, మాదాసు నరసింహ, ఈశ్వరయ్య, మద్దూరిమన్మథ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరమని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలోని అంకిశెట్టిపల్లి, పొన్నీటీపాళ్యం,మ వేంపల్లి పంచాయతీలలో పది మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం వేగవంతంగా నిర్వహిస్తోందన్నారు. కూటమి పాలనలో ప్రజల కష్టాలను తెలుసుకుంటూ వివిధ అనారోగ్య పరిస్థితులలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులకు సిఎం సహాయ నిధి నుంచి నుండి నిధులను మంజూరు చేసి నేరుగా లబ్దిదారుల ఇంటికి వెళ్లి అందించే బాధ్యత తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పన కోసం మరింత మెరుగ్గా పనిచే సేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని సూచించారు.అంతకుముందు అంకిశెట్టిపల్లి పంచాయతీ ఇన్‌ఛార్జి వెంకట రమణ ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జెవి రమణ, జెసిబి వేణు, జివి.నాయుడు, ఈశ్వర్ నాయుడు, గురునాథ్‌యాదవ్, నాగమణి, రెడ్డిరాయల్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ముక్కోటి ఏకాదశికి ఆలయాలు ముస్తాబు

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఛైర్మన్ నవీన్ చౌదరి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ గంగారపు నవీన్‌కుమార్‌చౌదరి తెలిపారు. సోమవారం ఆల యంలో కమిటీ సభ్యులు, కార్య నిర్వాహణ అధికారి, సిబ్బందితో కలిసి ఏర్పాట్లను పర్య వేక్షిం చారు. మంగళవారం ఉదయం 2:30 గంటల నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి వారిని దర్శిం చు కోవటానికి విస్తృత ఏర్పాట్లు చేయడంతో పాటు వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని శోభా యమానంగా అలంకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. శ్రీ ప్రసన్న వేంకటరమణ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు డి.భాస్కర్, కె.మల్లిక, వి.అజయ్ పండిట్, కె.శ్రీరాములు, టి.మంజునాథ,వి.మారుతి, ఎస్.నాగమణి,బి.బుజ్జమ్మ, కె.రాజేష్, ఎం.ఉష, ఏ.ఆర్.గోవర్ధన్ బట్టార్ లతో పాటు, కార్యనిర్వహణ అధికారితో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. **నందలూరు :** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ మంగళవారం వైకుంఠ ఏకాదశి కోసం ఉత్తర ద్వారం ద్వారా వైకుంఠ వాకిళ్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఉత్తర ద్వారం నుంచి వైకుంఠ వాకిళ్ల (ఏడు వాకిళ్లు) ద్వారా భక్తులు వెళ్లి సౌమ్యస్వామిని దర్శించుకోవడం జరుగుతుందన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు స్వామివారికి లక్ష తులసి అర్చన, ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రబీలో ఫసల్ బీమాపై చేతులెత్తేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

రబీలో ఫసల్ బీమాపై కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేం పల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రబీలో అత్యధికంగా రైతులు పంటలు సాగు చేస్తారని చెప్పారు. అధిక వర్షాలతో పంటలు నష్టపోతే రైతులకు ఫసల్ బీమా ధీమాగా ఉంటుందని రైతులు ఆనందపడేవారని తెలి పారు. డిసెంబర్ 31 వచ్చినా ఇంతవరకు ఆన్‌లైన్‌లో కడప జిల్లా చూపించడం లేదన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం రైతుల మీద భారం పడకుండా ప్రభు త్వమే డబ్బు చెల్లించేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పాత పద్ధతిలో అమలు చేస్తామని హామీ కూడా ఇచ్చిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు ఆన్‌లైన్‌లో చూపుతున్నప్పటికీ కడప జిల్లా మాత్రం లేదన్నారు. ఈ ఎడాది నువ్వులు, మినుము పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ముఖ్య మంత్రికి కడప జిల్లా అంటే కక్ష ఎందుకని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రైతుల బాధలు అర్థం కాలేదాని ఆయన ప్రశ్నించారు. జనవరి 30 వరకు గడువు పెంచి ఫసల్ బీమా చెల్లించేలా చూడాలని మస్తాన్‌రెడ్డి కోరారు.

ఎమ్మెల్యేచే ప్రశంసా పత్రం అందుకుంటున్న చెల్లయ్య

కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

కష్టపడి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు, నాయకులను పార్టీ గుర్తించి తగిన గుర్తింపు ఇస్తుందని పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్వగృహం నగిరిపల్లిలో సుపరిపాలన కార్యక్రమం పైన బూత్ స్థాయిలో కష్టపడి పనిచేసిన బూత్ ఇంఛార్జిలకు ఆయన ప్రశంసా పత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అన్ని బూతుల్లోనూ కష్టపడి పని చేస్తే పార్టీ గుర్తించి ఎదగ డానికి తగిన అవకాశాలు ఇస్తుందని దీన్ని నాయకులు సద్వినియోగం చేసుకొని వారి వారి గ్రామాల్లో పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి, వారి సమస్యలను పరి ష్కరించడానికి కృషి చేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన వాసునూరు చెల్లయ్య, కలికిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన వైజాగ్ భాష, చెరువు ముందరపల్లికి చెందిన మునాఫ్ లకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్ర మంలో మండల టిడిపి అధ్యక్షుడు కెఎస్.షాబుద్దీన్, దినకర్, మున్వర్‌అలీ పాల్గొన్నారు.

డిఆర్ఒకు పూలకుండీ అందిస్తున్న గ్రామస్తులు

దారి సమస్య పరిష్కారంపై హర్షం

ప్రజాశక్తి-రాయచోటి

మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని కంచరపల్లి కాలనీ నుంచి తమటం వారిపల్లె గ్రామానికి దారి సమస్య పరిష్కరించినందుకు కలెక్టర్‌కు ఆ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా దారి సమస్యతో తాము ఇబ్బంది పడుతున్నామని కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ ఈసమస్యను పరిష్కరించారని ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదన రావును కలిసి కలెక్టర్, తహశీల్దార్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వినికిడి యంత్రం అమర్చుతున్న డాక్టర్ భార్గవి

వినికిడి లోపాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి-రాజంపేట

పట్టణంలో సోమవారం ఆది సొసైటీ ఫర్ అప్లిఫ్మెంట్ అఫ్ రూరల్ ఎకానమీ ఆధ్వర్యంలో చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ భార్గవి ఉచిత వినికిడి యంత్రాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినికిడి లోపాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించలన్నారు. శబ్ద టూరిజం కాలుష్యాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉచిత వినియోగ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆడియాలజిస్ట్ బాబురావు పాల్గొన్నారు.

అధికారుల సూచనల మేరకు యూరియా వాడాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు పంటలకు యూరియా వాడాలని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. బొందలకుంట రైతు సేవా కేంద్రంలో సోమవారం ఆయన రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ బొందలకుంట, యామవరం రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. డిబిటి పద్ధతిలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కొత్రపాడు, శెట్టివారిపల్లె, కొత్తపల్లె, కొలవలి రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా అందు బాటులోకి వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ కోరారు.

రియల్టర్ల నుంచి రక్షణ కల్పించండి

- మాజీ సైనికుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కొందరు రియల్టర్లు తమ భూమిని ఆక్రమించేందుకు కుట్రపన్ని తనపై దాడి చేశారని మాజీ సైనికుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాజీ సైనికులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పీలేరుకు చెందిన తాను భారత సైన్యంలో 17 ఏళ్ల పాటు సేవలు అందించి రిటైర్డ్ అయ్యానన్నారు. తనకు పీలేరు మండలం, బోడుమల్లవారిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 658/1ఎ లో పూర్వీకుల నుంచి సంక్రమించిన 1.27 ఎకరాల భూమి ఉందన్నారు. తన భూమి పక్కనే రియల్టర్లు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మహేష్‌గుప్తా వేరే భూమి కొని, తమ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేశారన్నారు. తాను తన మామ మహేశ్వర్‌రెడ్డి అక్రమణను అడ్డుకోబోతే ఈనెల 25న విచక్షణ రహితంగా దాడి చేసి 25వ తేది తమపై దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారన్నారు. తాను పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేయాల్సిన పోలీసులు రియల్టర్లతో కుమ్మక్కై కేసు నిర్వీర్యం చేసేందుకు ఇరువురి పై కేసులు నమోదు చేశారన్నారు. భారతదేశ రక్షణ కొరకు 17ఏళ్ల పాటు సేవలు అందించి, రిటైర్ ఇంటికి వచ్చిన తనకు ప్రభుత్వం సెంటు భూమి ఇవ్వకపోయినా పూర్వీకులనుంచి సంక్రమించిన భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటే దానిపై రియల్టర్లు కన్నేసి తమపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సైతం న్యాయం చేయలేదని ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. అనంతరం మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ దేశ భద్రత కోసం 17 ఏళ్ల పాటు సేవలందించిన లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పై రియల్టర్లు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడితే న్యాయం చేయాల్సిన పోలీసులు తీవ్ర అన్యాయం చేస్తూ రియల్టర్లకే వత్తాసు పల కడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా పూర్వాపరాలు పరిశీలించి మాజీ సైనికుడికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ సైనికులు రెడ్డెప్పరెడ్డి, దామోదర్‌రెడ్డి, సుబ్బరాయుడు, జనార్ధన్, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీపతి, రవీంద్రారెడ్డి, హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సైనికులు